సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



శంకరజయంతి వేడుకలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న శంకర జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



రాధాకృష్ణుల కల్యాణం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గొల్లపల్లి శ్రీగీతామందిరంలో ఆదివారం రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించారు. ప్రతీ నెల కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/24.0

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.





ఈ యువకుడి పేరు నాగరాజు. గోల్డ్‌స్మిత్. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటాడు. నాగరాజుకు ఇద్దరు అక్కలు. తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇంటి బాధ్యతలు తనపై వేసుకున్నాడు. పీజీ పూర్తిచేసినా.. ఉద్యోగం వైపు చూడకుండా కులవృత్తిపైనే ఆధారపడ్డాడు. బంగారు ఆభరణాల తయారీపై గోదావరిఖనిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. తరువాత కరీంనగర్‌లో పనిచేశాడు. ఇద్దరు అక్కల వివాహాలు చేశాడు. ప్రస్తుతం ఇంటివద్దే దుకాణం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కులవృత్తి అన్నం పెడుతోందని, అందుకే వేరే ఆలోచన చేయలేదని నాగరాజు చెబుతున్నాడు.

పోటీ ఉంది..

నేను బీకాం పూర్తిచేశాను. 12 ఏళ్లుగా మా కులవృత్తిలోనే కొనసాగుతున్నా. కొత్త ఇండ్లకు అవసరమైన మెటీరియల్, మంచాలు, సోఫాలు, తదితర ఫర్నీచర్ తయారు చేస్తుంటాను. మా కులవృత్తిలోనూ పోటీ ఉంది. బిల్డర్లు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు మెటీరియల్ తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం కూడా మాకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తే బాగుంటుంది. – నూతి సంతోశ్‌కుమార్, అమర్‌నగర్, పెద్దపల్లి

కులవృత్తుల్లో ఈతరం

కనుమరుగవుతున్న కళకు జీవం

- ఆధునీకతను జోడిస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..
- కుటుంబానికి అండగా.. ఉపాధితో ఆనందంగా..
- కులవృత్తిలో అధిక సంఖ్యలో నాయీబ్రాహ్మణులు..
- అతితక్కువగా శాలివాహనులు

అంతరించిపోతున్న కళలకు వారు జీవం పోస్తున్నారు. నాటితరం బాధ్యతను భుజాన వేసుకుని ఈ తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉన్నత చదువులు చదివినా.. కార్పొరేట్ ఉద్యోగాలబాట పట్టకుండా.. పుట్టిన ఊరిలో నమ్ముకున్న కులవృత్తి చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. తాతలు, తండ్రులు నేర్పిన పనే ఇప్పుడు కుటుంబానికి ఆసరా అవుతోందని చెబుతున్నారు. తాము చేసే పనికి మరింత ఆధునీకతను జోడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వృత్తిలో మరింత నైపుణ్యత సాధిస్తూ వచ్చిన ఆదాయంతో ఆనందంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న యువతలో ఎక్కువగా నాయీబ్రాహ్మణులు ఉండగా.. అతితక్కువ శాలివాహనులు ఉన్నట్లు సమాచారం. కనుమరుగవుతున్న కులవృత్తులకు జీవం పోస్తున్న యువ'తరం'పై ప్రత్యేక కథనం.. - సాక్షి, కరీంనగర్ డెస్క్



ఈ యువకుడు ఎనగందుల రాజు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన రాజు డిగ్రీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో మంచి ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లలేదు. గ్రామంలోనే తండ్రి, సోదరుడితో కలిసి సెలూన్ ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం ముగ్గురు కలిసి పనిచేస్తుంటున్నారు. ఖర్చులు పోను నిత్యం రూ.500 మిగులుతాయని రాజు చెబుతున్నాడు. తనకు కులవృత్తి చేయడం అంటే ఇష్టమని, అందుకే వేరే ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లలేదని అంటున్నాడు. అయితే.. పట్టణాల్లో వెలుస్తున్న కార్పొరేట్ సంస్థలు తమ ఉపాధిని దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చిరువృత్తికారులకు అండగా ఉండి, కార్పొరేట్ సంస్థలకు అనుమతి ఇవ్వొద్దని రాజు కోరుతున్నాడు.

ఈయన తాళ్లపెల్లి మహేందర్‌గౌడ్. సొంతూరు మానకొండూర్ మండలం వెల్ది. కుటుంబ పరిస్థితులు ఉన్నత చదువులకు అడ్డంకిగా మారాయి. వ్యవసాయం, కులవృత్తే ఇతనికి ఆధారమైంది. ఉన్న భూమిని సాగుచేసుకుంటూ.. పొద్దున, సాయంత్రం తాటిచెట్లు ఎక్కుతూ కల్లు గీస్తుంటాడు. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇక్కడ విశేషం ఏంటంటే.. ఈ గ్రామంలో ఈయన తరంలో కల్లుగీత కార్మికుల్లో ఇతను ఒక్కడే ప్రస్తుతం పనిచేస్తున్నాడు. మిగతా వారందరూ ప్రత్యామ్నాయం చూసుకున్నారు. 'మేము నలుగురం అన్నదమ్ములం. కులవృత్తి చేయడంలో ఆనందం ఉంది. ఒక్కడినే ఊళ్లో ఉంటున్నా. అందరూ ప్రత్యామ్నాయం వెతుకున్నారు. ప్రభుత్వం మాకు అండగా ఉండాలి' అని మహేందర్ కోరుతున్నాడు.



ఆధునీకతను జోడిస్తూ..

ప్రస్తుతకాలంలో కులవృత్తి చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. డిగ్రీ పూర్తికాగానే ప్రైవేటు ఉద్యోగమో.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపరేషనో చేస్తున్నారు. ఇలా గత రెండు, మూడు దశాబ్దాల నుంచే కులవృత్తులు అంతరించిపోవడం కనిపిస్తోంది. అందివచ్చిన మిషనరీ చాలా కులవృత్తులను చావుదెబ్బ కొట్టగా... గ్రామాల్లోని యువతకు చేతిలో పనిలేకుండా పోయింది. కార్పొరేట్ కంపెనీలు.. రెడీమేడ్ వస్తువులు చేతివృత్తులపై ప్రభావం చూపాయి. చాలా మంది పనుల నిమిత్తం వలస వెళ్లిన సందర్భాలు అనేకం. అయితే ప్రస్తుత యువత ప్రజల అభిరుచికి అనుగుణంగా వారి కులవృత్తిలో ఆధునీకతను జోడిస్తూ ముందుకు సాగుతున్నారు. ఎట్టణాల్లో ఉండే సదుపాయాలను గ్రామాల్లోనూ కల్పిస్తూ కులవృత్తులకు జీవం పోస్తున్నారు.

ట్రెండ్ సెట్ చేస్తూ..

ప్రస్తుత యువత కులవృత్తిలో నయా ట్రెండ్ సెట్ చేస్తున్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా నడుచుకుంటున్నారు. నాయీబ్రాహ్మణులు పల్లెల్లోనూ పట్టణాల్లో ఉండేలా సెలూన్లు తీర్చిదిద్దుతున్నారు. కొత్త కొత్త హెయిర్‌స్టైల్స్‌తో ఆకట్టుకుంటున్నారు. గోల్డ్‌స్మిత్‌లు పెద్దపెద్ద బంగారు దుకాణాల్లో దొరికేవాటికన్నా సరికొత్త డిజైన్లు తయారు చేస్తున్నారు. వివిధ సైట్లలో సెర్చ్ చేస్తూ అందమైన పసిడి ఆభరణాలు తయారు చేస్తున్నారు. కార్పెంటర్లు కూడా కంప్యూటరైజ్డ్ డిజైన్లు తయారు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంటూ.. కంటికి ఇంపైన ఇంటీరియల్ తయారు చేస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. అదే విధంగా వివిధ కులవృత్తుల యువత ప్రస్తుత టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ చేతివృత్తులకు సరికొత్త నిర్వచనం ఇస్తున్నారు.

వీరు ఎక్కువ...

ఉమ్మడి జిల్లా పరిధిలో నాయీబ్రాహ్మణుల్లో ఎక్కువగా యువత కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 10వేలకు మందికి పైగా యువత పట్టణాలు, గ్రామాల్లో సెలూన్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నిత్యం రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తామని పలువురు చెబుతున్నారు. తరువాత రజకులు 5వేల మంది వరకు కులవృత్తిపై ఆధారపడ్డారు. అయితే వీరికి గ్రామాల్లో తక్కువగా ఉపాధి ఉండగా.. పట్టణాలకు వలసవెళ్తున్నారు. కరీంనగర్‌లో అత్యధిక మంది యువత లాండ్రీపై ఆధారపడి బతుకుతున్నారు. విశ్వబ్రాహ్మణుల్లోనూ చాలా మంది సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 4వేలకు పైగా మంది గోల్డ్‌స్మిత్, కార్పెంటర్, ఫర్నిచర్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. గౌడకులస్తుల్లో యువత కల్లుగీయడానికి ముందుకు రావడం లేదు. ఒక్కో గ్రామంలో ఒక్కరిద్దరు మాత్రమే కల్లుగీసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3వేల మంది వరకు యువత కల్లుగీతపై ఆధారపడి బతుకుతున్నారు. సిరిసిల్లలో బట్టల తయారీలో యువతరం తమ ప్రతిభ చాటుతోంది. మత్స్యకారుల కుటుంబాల్లోనూ యువత చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నారు. ఎల్‌ఎండీ, మిడ్‌మానేరు, ఎగువమానేరు, కాళేశ్వరంతో ఉపాధి పెరిగిందని చెబుతున్నారు. ఇక మేరు, శాలివాహనులు తదితర కులస్తులు తమ వృత్తిలో ఉపాధి లేకపోవడంతో ప్రత్యామ్నాయ బాటపడుతున్నారు. ప్రతీ కులస్తులు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరుతున్నారు. తమ వృత్తికి సంబంధించి సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతున్నారు. సర్కారు ప్రోత్సాహం ఉంటే తాము మరింత ఉత్సాహంగా పనిచేస్తామని, తమ వృత్తులను బతికించుకుంటామని చెబుతున్నారు.

అమ్మానాన్నకు తోడుగా..



మాది కరీంనగర్. నాన్న చిరుద్యోగి. అమ్మ కులవృత్తి చేస్తుంది. నేను డిగ్రీ పూర్తిచేశాను. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. ఇంట్లోనే లాండ్రీ షాపు నడిపిస్తాం. నాన్న డ్యూటీకి వెళ్లినప్పుడు నేనూ ఇస్త్రీ చేస్తుంటాను. పొద్దంతా ఉద్యోగానికి వెళ్లివచ్చి సాయంత్రం కులవృత్తి పని చేస్తుంటా. మా పని మేము చేసుకోవడంలో ఆనందమే వేరు. ప్రభుత్వం ఇంట్లోని లాండ్రీలకు కూడా విద్యుత్‌లో రాయితీ ఇవ్వాలి. – నరేశ్, హనుమాన్‌నగర్, కరీంనగర్

15 ఏళ్లుగా ఇదే పని..



మాది సిరిసిల్లలోని సుందరయ్యనగర్. నేను పెద్దగా చదువుకోలేదు. నాకు 17ఏళ్ల వయసు అప్పటి నుంచి మరమగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాను. దాదాపు 15ఏళ్లకు పైగా ఇదే వృతిలో కొనసాగుతున్నాను. వారానికి రూ.2,000–2,500 వరకు సంపాదిస్తాను. నాకు ఇద్దరు పిల్లలు. వచ్చిన ఆదాయం కుటుంబపోషణకే సరిపోతోంది. – పిక్కల శేఖర్, సిరిసిల్ల

ప్రభుత్వం దయ చూపాలి



నేను 16ఏళ్లుగా పెద్దపల్లిలో దర్జీగా పనిచేస్తున్నా. మా నాన్న నుంచి పని నేర్చుకున్నాను. ప్రస్తుతం రెడీమేడ్ వస్త్రాలతో గిరాకీ తగ్గిపోయింది. వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతోంది. ఇక ఈ వృత్తిలోకి మా పిల్లలను రానివ్వను. ప్రభుత్వం మాపై దయచూపాలి. స్కూల్ యూని ఫాంలు కుట్టే బాధ్యత మాకే ఇవ్వాలి. ఇతర కులస్తులకు రాయితీపై బట్టలు కుట్టే మిషనరీలు ఇస్తున్నారు. అవి మాకూ ఇస్తే బాగుంటుంది. రెడీమేడ్‌పై ట్యాక్స్ విధించాలి. – మంథని నర్సింగ్, పెద్దపల్లి

యారన్ సబ్సి 'డీలా' !

- గడువులన్నీ దాటిపాయే..
- నూలు రాయితీ రాకపాయే..
- అందని 2020 నాటి శ్రమఫలం
- వివరాలివ్వని వస్త్రోత్పత్తిదారులు
- సిరిసిల్లలో నేతన్నల నిరీక్షణ



జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



నెరిసిన గడ్డం.. బేల చూపులతో సాంచాలు నడుపుతున్న ఇతని పేరు గడ్డం ఎల్లయ్య(55). సిరిసిల్ల పట్టణ శివారులోని తంగళ్లపల్లిలో పవర్ లూమ్స్ నడిపించే ఎల్లయ్య 2020లో సిరిసిల్లలోని బీవైనగర్ కార్మిక క్షేత్రంలో సాంచాలు నడిపించే వాడు. ఎల్లయ్య 2019లో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బట్టకు సంబంధించి యారన్ సబ్సిడీ రూ.23వేలు వచ్చాయి. ఇంకా 2020లో ఉత్పత్తి చేసిన చీరల బట్టకు సంబంధించిన రూ.25వేలు రావాల్సి ఉంది. ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయా.. అని నిరీక్షిస్తున్నాడు.



ఇతని పేరు గుండేటి దశరథం(32). సిరిసిల్లలోని గణేశ్‌నగర్‌లో సాంచాలు నడిపిస్తాడు. నిత్యం సాంచాల మధ్య రెక్కలు ముక్కలు చేసుకుని బతుకమ్మ చీరల బట్టను ఉత్పత్తి చేస్తే 2019లో రూ.34వేలు నూలు సబ్సిడీ వచ్చింది. 2020 నాటిది ఇంకా రూ.40వేల వరకు రావాల్సి ఉంది. ఇవి కాకుండా.. 2021 నాటిది, 2022 నాటిది కూడా యారన్ సబ్సిడీ రావాల్సి ఉంది. ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఏడు వేల మంది కార్మికులు ఇలా యారన్ సబ్సిడీ డబ్బుల కోసం ఏళ్లుగా పడిగాపులు కాస్తున్నారు.

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో శ్రమించే కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇస్తోంది. వీటి ద్వారా కార్మికులకు భారీగా ప్రయోజనాలు కలుగుకపోయినప్పటికీ కూలి లభిస్తుంది. అంతేకాకుండా మరింత మెరుగైన జీవితం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కార్మికులకు సైతం నూలు రాయితీ ఇచ్చేందుకు అంగీకరించింది. కానీ కార్మికుల వివరాలు ఇవ్వడంలో వస్త్రోత్పత్తిదారులు చేస్తున్న నిర్లక్ష్యానికి కార్మికులు నష్టోపోతున్నారు.

ఏమిటీ యారన్ సబ్సిడీ ?

సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికులు కూలి పెంచాలని కోరుతూ 2018లో సమ్మెకు దిగారు. పాలిస్టర్ బట్టను ఒక్కో కార్మికుడు ఎనిమిది సాంచాలపై ఉత్పత్తి చేస్తాడు. తెల్లని పోగులు కావడంతో కంటికి పెద్దగా ఇబ్బంది లేకుండా ఉత్పత్తి అవుతుంది. ఎన్ని మీటర్లు కార్మికుడు బట్టను ఉత్పత్తి చేస్తే అన్ని మీటర్లకు కూలి లభిస్తుంది. కానీ బతుకమ్మ చీరల బట్ట రంగుల్లో ఉండడం, పోగులు నల్లగా ఉండడంతో కంటికి ఇబ్బందిగా మారి నాలుగు సాంచాలపై చీరల బట్టను ఉత్పత్తి చేసే పరిస్థితి ఎదురైంది. దీంతో కూలి గిట్టుబాటు కావడం లేదని కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. బతుకమ్మ చీరల ఉత్పత్తి మధ్యలో ఉండగా.. కూలి పెంచడం సాధ్యం కాదని జౌళిశాఖ అధికారులు స్పష్టం చేశారు. కానీ కార్మికులు ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బట్టకు 10 శాతం నూలు రాయితీ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఒక్కో కార్మికుడు ఉత్పత్తి చేసిన చీరల బట్టపై మీటరుకు రూ.1.25 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ లెక్కన ఒక్కో కార్మికుడికి రూ.15 వేల నుంచి రూ.40 వేలు వరకు నూలు సబ్సిడీ వస్తుందని లెక్కలు తీశారు. 2018లో కార్మికులు ఉత్పత్తి చేసిన బట్టకు 10 శాతం నూలు రాయితీని 2021లో అంటే మూడేళ్లు ఆలస్యంగా 4 వేల మంది కార్మికులకు రూ.4 కోట్ల మేరకు అందించారు. ఇలా 2019 నాటిది ఆరు నెలల కిందట కార్మికులకు రూ.8.65 కోట్లు చెల్లించారు. ఇంకా 2020 నాటిది, 2021, 2022లో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బట్టకు సంబంధించిన మూడేళ్ల నూలు రాయితీ డబ్బులు కార్మికులకు రావాల్సి ఉంది.

ఆలస్యానికి కారణాలేమిటి ?

సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో కార్మికులు నిలకడగా ఎక్కువ కాలం ఒకే కార్ఖానాలో పనిచేయరు. వివిధ కారణాలతో కార్ఖానాలు మారుతుంటారు. 2018 నుంచి యారన్ సబ్సిడీ అమలు కావడంతో ఇప్పుడు నిలకడగా ఒకే చోట పనిచేసేందుకు సిద్ధమయ్యారు. కానీ మూడేళ్ల కిందట పనిచేసిన కార్మికుల వివరాలు, వారు ఉత్పత్తి చేసి చీరల బట్ట మీటర్ల సమాచారం వస్త్రోత్పత్తిదారుల వద్ద సమగ్రంగా లేదు. జియోట్యాగింగ్ ఆధారంగా సాంచాల వివరాలు జౌళిశాఖ వద్ద ఉన్నా.. కార్మికుల సమాచారం లేదు. ఇలా సమగ్రత లేక ఆసాముల పేర్లను కార్మికులుగా పేర్కొంటూ అందించారు. దీంతో వాస్తవంగా పనిచేసిన కార్మికులకు నష్టం జరుగుతుంది. వస్త్రోత్పత్తిదారులు కార్మికుల వివరాలు ఇవ్వడంలో జాప్యం చేయడంతో నూలు రాయితీ చెల్లింపుల్లో ఆలస్యమవుతుంది.

ఏం చేయాలి ?

రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏటా రూ.340 కోట్లతో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తోంది. కానీ కార్మికులకు దక్కే ప్రయోజనం అంతంత మాత్రమే. 10 శాతం నూలు సబ్సిడీ పేరిట కొంత మేరకైనా లబ్ధి కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా.. వస్త్రోత్పత్తిదారులు వారి వద్ద పనిచేసిన కార్మికుల వివరాలు ఇవ్వడం లేదు. జౌళిశాఖ అధికారులు ఇలా వివరాలు ఇవ్వని వస్త్రోత్పత్తిదారుల యూనిట్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, కొత్త ఆర్డర్లు ఇవ్వకపోతే కార్మికులకు వేగంగా ప్రభుత్వ నూలు రాయితీ దక్కే అవకాశం ఉంది. తప్పుడు వివరాలిచ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఇలాంటి చర్యలతో క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మికులకు ప్రయోజనం కలుగుతుంది. ఆ దిశగా రాష్ట్ర మంత్రి కేటీఆర్, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జౌళిశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

మే డేలోగా చెల్లించాలి




యారన్ సబ్సిడీ చెల్లించాలని అనేక సార్లు జౌళిశాఖ ఆఫీస్ ముందు ధర్నాలు చేశాం. అధికారులకు వినతి పత్రాలు ఇచ్చాం. కానీ 2020 నాటి సబ్సిడీ ఇంకా రాలేదు. మే డేలోగా నేత కార్మికులకు యారన్ సబ్సిడీ అందించాలి. లేకుంటే కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.
– కోడం రమణ, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

నెలాఖరులోగా వివరాలు అందిస్తాం



ఇప్పటికే రెండు దఫాలుగా యారన్ సబ్సిడీకి సంబంధించిన కార్మికుల వివరాలు పంపించాం. అన్నీ కలిపి ఒకేసారి ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. ఈమేరకు ఈ నెలాఖరులోగా పూర్తి వివరాలు అందిస్తాం. ఇది పూర్తయితే నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమవుతాయి.
– ఎం.సాగర్, జౌళిశాఖ ఏడీ, సిరిసిల్ల

'శింగిరెడ్డి శతకం' ఆవిష్కరణ



శింగిరెడ్డి శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, జిల్లా కవులు

సిరిసిల్లకల్చరల్: సమాజాన్ని చైతన్యం దిశగా నడిపించేదే నిజమైన కవిత్వం అని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం పేర్కొన్నారు. శింగిరెడ్డి రాజిరెడ్డి వెలువరించిన 'శింగిరెడ్డి శతకం' పుస్తకాన్ని సిరిసిల్ల సాహితీ సమితి సారథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ హనుమాన్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. లక్ష్మీరాజం మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలోని వైవిధ్యమైన అంశాలను ఆటవెలది పద్యాల్లో అందంగా కూర్చారని ప్రశంసించారు. 111 పద్యాలు గల పుస్తకంలో దైవభక్తి, పాపభీతి, సమాజ సంస్కరణ భావాలను అక్షరీకరించిన విధానం ఆకట్టుకుందని కొనియాడారు. మరో అతిథి వరుల శివకుమార్ మాట్లాడుతూ రైతుగా హలాన్ని కవిగా కలాన్ని సమవడితో నడిపించారని ప్రశంసించారు. శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కడారు వీరారెడ్డి సెల్‌ఫోన్‌లో తన సందేశాన్ని అందజేశారు. అనంతరం కవి రాజిరెడ్డి దంపతులను సన్మానించారు. ఇటీవల కన్నుమూసిన ఆచార్య రవ్వా శ్రీహరికి నివాళి అర్పించారు. సమితి గౌరవాధ్యక్షుడు పారంద్ల మురళీధర్, అధ్యక్షుడు జనపాల శంకరయ్య, కార్యదర్శి వెంగల లక్ష్మణ్, వాసరవేని పరశురాం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్న, వైరాగ్యం ప్రభాకర్, మధు, రవి, బుర్క గోపాల్, రఘునందన్, వాణి, వెంకట్‌రెడ్డి, మడుపు రత్నాదేవి, సుంక ధరణి, అంజనాదేవి, నేరోజు రమేశ్, శోభారాణి పాల్గొన్నారు.

రాజన్నకు మొక్కులు





వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు తరలివస్తున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు.

హైకోర్టు ఏజీపీగా దిలీప్‌కుమార్



దిలీప్‌కుమార్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడూరుకు చెందిన బొమ్మెన దిలీప్‌కుమార్ రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఏజీపీల నియామకం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గూడూరు గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్‌ను కూడా ప్రభుత్వం ఏజీపీగా నియమించడం అభినందనీయమని సిరిసిల్ల కోర్టు ఏజీపీ రవీందర్‌రావు, అడ్వకేట్లు సంతోష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ శరత్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు చీటి వెంకటనర్సింగారావు, చీటి జితేందర్‌రావు అభినందనలు తెలిపారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ దయానంద్



ఎమ్మెల్సీ దయానంద్‌ను సత్కరిస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్నను హైదరాబాద్ ఎమ్మెల్సీ దయానంద్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. ఆలయ అర్చకులు శరత్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

క్లుప్తంగా

ఈద్ మిలాఫ్



టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మహ్మద్ రియాజ్ పాషా

సిరిసిల్ల: సిరిసిల్లలో ఈదుల్ ఫితర్ సందర్భంగా ఆదివారం టీఎన్‌జీవో జిల్లా కోశాధికారి మహ్మద్ రియాజ్ పాషా ఈద్ మిలాఫ్ నిర్వహించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఈ ఏర్పాట్లు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా టీఎన్‌జీవో అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి గాజుల సుదర్శన్‌లకు పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు. అసోసియేట్ ప్రెసిడెంట్ మెట్ట శ్రీకాంత్, ఇతర టీఎన్‌జీవో ఉద్యోగులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రవ్యాపార సంఘం అధ్యక్షుడిగా దామోదర్



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల చేనేత వస్త్రవ్యాపార సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా తాటిపాముల దామోదర్, ప్రధాన కార్యదర్శిగా గౌడ రాజు, ఉపాధ్యక్షుడిగా ఏనుగుల ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా సాప గణేశ్, కోశాధికారిగా శ్రీగాధ విష్ణు, డైరెక్టర్లుగా అల్లె సత్యనారాయణ, బైరి సత్యనారాయణ, మేర్గు సత్యనారాయణ, సిరిపురం కృష్ణ, పోతు శ్రీనివాస్, అన్నల్‌దాస్ శ్రీనివాస్, దూడం శ్రీనివాస్, జిందం శ్రీనివాస్, బొద్దు శ్రీధర్, చిలగాని మల్లేశం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కారంపురి దేవవాసు ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని పట్టణ ప్రముఖులు అభినందించి, సన్మానించారు.

ఈటల దిష్టిబొమ్మ దహనం

ముస్తాబాద్: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు మండలకేంద్రంలో ఆదివారం దహనం చేశారు. యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాళ్ల విజయ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తుంటే.. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు రూ.25 కోట్లు ఇచ్చారని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు భానురెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరి మరణం సాహితీ రంగానికి తీరని లోటు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : ప్రముఖ కవి, మాజీ తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ రవ్వా శ్రీహరి మృతి సాహితీ లోకానికి తీరని లోటని తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు వాసరవేని పర్శరాం అన్నారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీహరి 2001లో కేంద్ర సాహిత్య అకాడమీ, ఉగాది పురస్కారం లాంటి ఎన్నో అవార్డులు అందుకున్నారన్నారు. దుంపెన రమేశ్, కవులు అజయ్, దస్తగిరి, రాజిరెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రుద్రంగి (వేములవాడ): మండలకేంద్రానికి చెందిన కుర్మ మల్లేశం గతనెలలో మస్కట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ పరామర్శించారు.

ప్రాణాలకు రక్షణేది?

- ఈత కోసం వెళ్తూ ప్రాణాలు కోల్పోతున్న జనం
- కనిపించని హెచ్చరికబోర్డులు
- మొదలుకాని ఫెన్సింగ్ పనులు
- ఉసురు తీస్తున్న ఈత సరదా
- పట్టించుకోని అధికారులు



"సిరిసిల్ల పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన గున్నాల నరేశ్ గతేడాది భార్య పిల్లలతో కలిసి తంగళ్లపల్లి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లాడు. పక్కనే మానేరు నది ఉండడంతో చూసేందుకు వెళ్లారు. చెక్‌డ్యాం లోతు అంచనా వేయకుండా భార్య, పిల్లలు అందులోకి దిగారు. నరేశ్‌కు ఈత రాకపోయినా భార్యపిల్లలను ఒడ్డుకు తోసి, అతడు నీటిలోనే మునిగిపోయాడు. చుట్టు పక్కలవారు వచ్చేసరికి ప్రాణాలు కోల్పోయాడు."



"గత సంవత్సరం ఏప్రిల్‌లో ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ వద్దకు అదే మండలం రేపాకు చెందిన కుర్ర శ్రీనివాస్, తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌కి చెందిన పొన్నం రాజు, మరో కుటుంబంతో కలిసి పుణ్యస్నానాలకు వెళ్లారు. స్నానం చేసేందుకు దిగగా లోతు తెలియకపోవడంతో అందులోనే గల్లంతయ్యారు. పోలీసులు, జాలర్లు శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. ఇదే ఘటనలో మరోక వ్యక్తిని కుటుంబ సభ్యులు రక్షించారు."



"సిరిసిల్ల రాజీవ్‌నగర్‌కు చెందిన ఆరు విద్యార్థులు 2021లో మానేరు వాగులో ఈత కొట్టేందుకు చెక్‌డ్యాం దగ్గరికి వెళ్లారు. లోతు ఎక్కువగా ఉన్న విషయాన్ని గమనించకుండానే కొలిపాక గణేశ్, కొంగ రాకేశ్, క్రాంతికుమార్, అజయ్, వెంకటసాయి, మనోజ్ ఒకరి తర్వాత ఒకరు దిగి నీట మునిగారు. వీరితో వచ్చిన మరో ఇద్దరు విద్యార్థులు విషయాన్ని స్థానికులకు తెలపడంతో అప్పటికే నీటి ప్రవాహానికి మృతదేహాలు గల్లంతయ్యాయి. మూడు రోజుల పాటు అన్వేషణ కొనసాగింది."

సిరిసిల్ల అర్బన్ : చిన్నారులు, యువత ఈత సరదా పలువురి కుటుంబాల్లో విషాదం నింపుతోంది. వేసవి కావడంతో ఎండనుంచి ఉపశమనం పొందేందుకు ఈత కొట్టేందుకు వెళ్లి పలువురు జలసమాధి అవుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఏటాత ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. అధికారులు ఎలాంటి ముందుస్తు రక్షణ చర్యలు చేపట్టడం లేదు. జలవనరుల వద్ద ఫెన్సింగ్, రక్షణ చర్యలు చేపడుతామన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. ఏదైనా సంఘటనా జరిగిన వెంటనే రక్షణ చర్యలు చేపడుతామంటూ చేతులు దులుపుకుంటున్నారు.

మానేరు...కన్నీరూ..

రాజన్న సిరిసిల్ల జిల్లా దాదాపు 40 కి.మీల పొడవునా మానేరునది ప్రవహిస్తుంటుంది. గంభీరావుపేట మండలంలోని నర్మాల వద్ద ప్రారంభమయ్యే మానేరునది ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, సిరిసిల్ల, వేములవాడ అర్బన్, బోయినపల్లి మండలాల మీదుగా కరీంనగర్ జిల్లాలోకి ప్రవహిస్తుంది. ఈ మానేరు వాగు ప్రవహిస్తున్న తీరాన ఎన్నో గ్రామాలు ఉన్నాయి. కొన్ని చోట్ల నీరు నిల్వ ఉంటుంది. వేసవి కావడంతో చిన్నారులు, యువకులు ఈతకోసం వెళ్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే స్పందిస్తున్నారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రమాదకర ప్రదేశాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కానరాని రక్షణ చర్యలు

మానేరు వాగుపై దాదాపు 11 చెక్ డ్యాంలను నిర్మించారు. ఈ చెక్ డ్యాంలు ఒక విధంగా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నాసిరకం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నీటి ప్రవాహ దాటికి కొట్టుకుపోయి గొయ్యిలు ఏర్పడుతున్నాయి. ఇసుకను ఇష్టానుసారంగా తోడేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతన్నాయి. దీంతో లోతు తెలియక ఎంతోమంది ప్రాణాలును కోల్పోతున్నారు. ఈ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, నీటిలో దిగకుండా రక్షణ చర్యలు తీసుకోవడం లేదు.

రక్షణ చర్యలు చేపడుతున్నాం



గతంలో జరిగిన ప్రమాదకర సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ఎగువ మానేరు నుంచి సిరిసిల్ల వరకు నదీ తీరంలో ప్రమాదకర ప్రదేశాల్లో రక్షణ చర్యలు చేపడుతున్నాం. హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– అమరేందర్ రెడ్డి,ఇరిగేషన్ ఈఈ

రేపు సిరిసిల్లలో గులాబీ పండుగ



పెద్దూరు బైపాస్ రోడ్డు అపెరల్ పార్క్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

- బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- హాజరుకానున్న మంత్రి కేటీఆర్
- భారీ ప్లీనరీకి బీఆర్‌ఎస్ ఏర్పాట్లు
- పార్టీ క్రియాశీల కార్యకర్తలు తరలిరావాలి
- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం గులాబీ పండుగను బీఆర్‌ఎస్ నిర్వహిస్తుంది. బీఆర్‌ఎస్(టీఆర్‌ఎస్) పార్టీ ఆవిర్భవించి 22 ఏళ్లు అయిన సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గం స్థాయిలో పార్టీ ప్లీనరీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు హాజరవుతున్నారు. సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు బైపాస్‌రోడ్డు, అపెరల్ పార్క్ వద్ద మంగళవారం జరిగే ప్లీనరీ ఏర్పాట్లను పార్టీ నాయకులు ఆదివారం సాయంత్రం పర్యవేక్షించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ క్రియాశీల సభ్యులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

పార్టీ క్రియాశీల కార్యకర్తలు తరలిరావాలి

– తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో పెద్దూరు అపెరల్ పార్క్ వద్ద జరిగే బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలకు నియోజకవర్గంలోని పార్టీ క్రియాశీల కార్యకర్తలు తరలిరావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. సభాస్థలి వద్ద ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణను సీఎం కేసీఆర్ నిలిపారన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆకుపచ్చని తెలంగాణను సాధించిన సీఎం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసే లక్ష్యంతో పార్టీ శ్రేణులు ముందుకుసాగాలని కోరారు. దేశానికి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని పొరుగు రాష్ట్రాలు కోరుకుంటున్నాయని ఆగయ్య గుర్తు చేశారు. మంగళవారం జరిగే పార్టీ ఆవిర్భావ ప్లీనరీ సమావేశానికి ప్రజాప్రతినిధులు, పార్టీ క్రియాశీల సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, గుండం నర్సయ్య, ఎంపీపీలు మానస, పిల్లి రేణుక, పార్టీ నాయకులు కల్వకుంట్ల గోపాల్ రావు, బొల్లి రామ్మోహన్, శ్రీనివాస్, కుంభాల మల్లారెడ్డి, గజభీంకార్ రాజ న్న, మాట్ల మధు, సర్వర్, లింగంయాదవ్, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

కాశీలో నిత్యాన్నదాన సత్రం

- ఆర్యవైశ్య వాసవి సత్రం పాలకవర్గం నిర్ణయం



పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్సీ దయానంద్

వేములవాడ: కాశీలో రాజరాజేశ్వర క్షేత్రం పేరుతో నిత్యాన్నదాన సత్రం నిర్మించనున్నట్లు ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదానసత్రం పాలకవర్గం తీర్మానించింది. అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం పాలకవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రం అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేసిన దాతలను సన్మానించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ మాట్లాడుతూ వేములవాడలోని ఆర్యవైశ్య నిత్యాన్నదానసత్రం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అభినందించారు. ఇందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. సత్రం కోశాధికారి కటకం కిషన్, ఉపాధ్యక్షులు ఉప్పుల రమేశ్, కటకం భూమయ్య, గంజి స్వరాజ్‌గుప్తా, నాయకులు నగుబోతు రవీందర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలను విభజిస్తున్న సంఘ్ పరివార్

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

బోయినపల్లి(చొప్పదండి): బీజేపీ, సంఘ్ పరివార్‌లు దేశ ప్రజలను విభజిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. పల్లెకు పల్లెకు సీపీఐ ప్రజాచైతన్యయాత్ర ఆదివారం బోయినపల్లికి చేరింది. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రధాని అయ్యాక దేశంలో మతవిద్వేషాలు పెరిగిపోయాయన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో దారిద్ర్యరేఖకకు దిగువ ఉన్న కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా నాయకులు గుంటి వేణు, మర్రి వెంకటస్వామి, కడారి రాములు, మనికంఠ రెడ్డి, మచ్చ రమేశ్, మంద సుదర్శన్, వెంకటేశ్, మల్లేశం పాల్గొన్నారు.

రజకుల ఐక్యతను దెబ్బతీసేందుకే దాడులు

- రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



ఐలమ్మ గద్దె ధ్వంసాన్ని చూపుతున్న శ్రీనివాస్

ముస్తాబాద్(సిరిసిల్ల): రజకుల ఐక్యతను దెబ్బతీసేందుకే కొందరు కావాలనే చాకలి ఐలమ్మ విగ్రహ గద్దెను ధ్వంసం చేశారని రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహ గద్దెను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం రజక సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ పోరాట స్ఫూర్తిని కలిగించే ఐలమ్మ విగ్రహాలపై పలు చోట్ల దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భావితరాలకు ఐలమ్మ త్యాగాలు, పోరాటాలను వివరించాల్సిన తరుణంలో ఇలా దాడులు చేయడం సరికాదన్నారు. ధ్వంసమైన గద్దెను తిరిగి నిర్మిస్తామన్నారు. అనంతరం ఐలమ్మ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ గౌతంరావు, రజక సంఘం మండల అధ్యక్షుడు నారాయణ, జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి మల్లేశం, బాలయ్య, సుద్దాల దేవయ్య, లింగంపల్లి దేవయ్య, పర్శరాములు, నర్సయ్య, గంగాధర్, శ్రీకాంత్, బాలమల్లు, శెరయ్య, సత్తయ్య, దీటి నర్సింలు, గిరి తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడు సమసమాజాన్ని కాంక్షించారు

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రావు
- కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు



సిరిసిల్ల కలెక్టరేట్‌లో బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న డీఆర్వో శ్రీనివాస్‌రావు

సిరిసిల్ల: కుల, వర్ణ, వర్గ, లింగ వివక్ష లేని సమసమాజాన్ని బసవేశ్వరుడు వందల ఏళ్ల కిందటే ఆకాంక్షించారని జిల్లా రెవెన్యూ అధికారి టి.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బసవేశ్వరుడి 890వ జయంతి వేడుకలను ఆదివారం అక్షయ తృతీయ సందర్భంగా నిర్వహించారు. డీఆర్వో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మనుషులందరూ ఒక్కటేనని, స్త్రీ, పురుష బేధం లేదని, శ్రమకు మించిన సౌందర్యం లేదని, భక్తి కంటే సత్ప్రవర్తనే ముఖ్యమని నమ్మిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు అని కొనియాడారు. వీరశైవ సంప్రదాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన సాంఘిక విప్లవకారుడు బసవేశ్వరుడు అన్నారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి మోహన్‌రెడ్డి, డీపీఆర్వో ఎం.దశరథం, సిరిసిల్ల తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షురాలు కాకరకాయల మంజుల, ఉపాధ్యక్షులు కె.శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎస్.చంద్రమౌళి, శీల గంగాధర్, శీల అరుణ, ఎస్.చంద్రకళ, ఉమ, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని రైతు చర్చా మండలిలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో ఆదివారం మహాత్మా బసవేశ్వర మహారాజ్ 890వ జయంతి నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ అహింస మార్గంలో ప్రజలు జీవించాలని బోధించారని గుర్తు చేశారు. అట్టడుగు వర్గాల ప్రజలు ఉన్నతంగా జీవించేలా భరోసా కల్పించారన్నారు. వీరశైవ లింగాయతుల సంఘం భవనానికి మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తామన్నారు. విగ్రహ ఏర్పాటుకు స్థానిక పాలకేంద్రం వద్ద అనుమతులు ఇస్తామని సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, సోముకుమార్, ఆకు ల రాములు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఠాణా దివస్‌కు స్పందన

- బాధితుల వద్దకే పోలీసులు
- పరిష్కారం చూపుతూ ఇరువర్గాల రాజీ..
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు



వెంకటాంపల్లిలో రోడ్డు సమస్యపై బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

వేములవాడరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలు వివిధ సమస్యలపై ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. వాటి పరిష్కారానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ఠాణా దివస్ పేరుతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఈనెల 4న వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఠాణా దివస్ పేరుతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. సమావేశానికి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు పట్టణంలోని పలువురు బాధితులు ఎస్పీకి విన్నవించారు. దాదాపు 53 వినతులను పరిశీలించిన ఎస్పీ వాటిని పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఇందులో భాగంగానే రూరల్ ఎస్సై నాగరాజు బాధితుల వినతులను పరిశీలించి దాదాపు పదిమందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగతా వాటిపై గ్రామాలకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తున్నారు. వచ్చిన ఫిర్యాదులపై పరిష్కరించేందుకు ఇరువర్గాలతో మాట్లాడి రాజీ కుదుర్చుతున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం మండలంలోని వెంకటాంపల్లిలో రోడ్డు సమస్యతో బాధపడుతున్న పలువురు బాధితులను సంఘటనా స్థలానికి పిలిపించి పరిష్కార మార్గాన్ని చూపారు. దీంతో పోలీస్ శాఖ చొరవపై బాధితులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



ఠాణా దివస్ కార్యక్రమంలో ఎస్పీ బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కరించాం. తమ పరిధిలో ఉన్న ప్రతి సమస్యను ఇరువర్గాలతో మాట్లాడి పరిష్కరిస్తున్నాం. గొడవలతో కేసులు పాలై ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు.

– నాగరాజు, ఎస్సై, వేములవాడ రూరల్

నష్టపోయిన పంటల పరిశీలన


చందుర్తి : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన అకాలవర్షానికి వరితో పాటు నువ్వులు పంట నేలకొరిగింది. దెబ్బతిన్న పంటలను, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, ఆర్ఐ, ప్రజాప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. నర్సింగాపూర్, జోగాపూర్, చందుర్తి, కిష్టంపే ట, బండపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభా లు నేలకొరగగా సెస్ అధికారులు మరమ్మతులు చే పట్టారు. అకాల వర్షానికి నష్టపోయిన పంటలకు ప రిహారం అందించాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీని వాస్, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలా కర్ తెలిపారు. అధికారులతో సర్వే చేయించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు.

ఎకరాకు రూ.25 వేలు అందించాలి..

పంటనష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దెబ్బతిన్న పంటల పొలాలతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అలాగే కిష్టంపేట గ్రామంలో నాగుల రవి అనే రైతుకు చెందిన పాడి గేదె చనిపోగా బాధిత రైతును పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

బావుసాయిపేటలో..

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట, గోవిందరావుపేట గ్రామాల్లో ఈదురుగాలులు, వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పరిశీలించారు. బావుసాయిపేట, గోవిందరావుపేట, కనగర్తి గ్రామాల్లో వర్షానికి పంటలు, ఆస్తినష్టం వాటిల్లింది. అధికారులతో మాట్లాడి బాధితులకు పరిహారం అందేలా చూస్తామని జెడ్పీ చైర్ పర్సన్ తెలిపారు. అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్‌తో మాట్లాడి రైతులకు జరిగిన నష్టాన్ని వివరించారు. సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచులు గంగాధర్, రజిత, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాం మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు, మల్యాల దేవయ్య పాల్గొన్నారు.



బావుసాయిపేటలో పంటలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్



జగన్మాతా.. నమోస్తుతే

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్ల ఆధ్యాత్మిక కళను సంతరించుకుంది. స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ మాత జయంతి ఉత్సవాలను కనులపండువగా నిర్వహించారు. లోక కల్యాణార్థం కాంక్షిస్తూ 216 మంది సుహాసినులు అమ్మవారి సన్నిధిలో అఖండ పారాయణం చేశారు. జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు అల్లాడి సరస్వతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.